క్లుప్తంగా

బేస్తవారిపేట ఎంపీపీకి మాతృ వియోగం


వేగినాటి మంగమ్మ

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ నాయకుడు, బేస్తవారిపేట మండల ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తల్లి వేగినాటి మంగమ్మ(93) గురువారం మృతిచెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బేస్తవారిపేట మండలంలోని ఖాజీపురంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని రాజుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రాజుపాలెం, వెంకటాపురం, ద్వారకచర్ల, ముక్తాపురం, వెన్నంపల్లె, పాయలపల్లె, క్రిష్ణంపల్లె, నరసింహునిపల్లె, లింగారెడ్డిపల్లె, రౌతుపల్లె, బసువపల్లె గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు


మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

పొదిలి రూరల్: పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలు చేయించుకుంటే రైతులపై పెట్టుబడి భారం తగ్గే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. గురువారం పొదిలి మండలం సూదనగుంట ఆర్బీకేలో సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కల్పించారు. జేడీఏ మాట్లాడుతూ.. ప్రతి ఆర్బీకే పరిధిలో మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఎరువులు, పురుగు మందుల సబ్సిడీ గురించి తెలియజేశారు. డ్రోన్ వాడకంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ షేక్ జైన్‌లాబ్దిన్, కేవీకే సిబ్బంది, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు


షేక్ తహసీన్, బి.వసంత్‌కుమార్, కె.శరణ్య

కొమరోలు: స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు లభించినట్లు కరస్పాండెంట్ బందుగుల నారాయణమ్మ తెలిపారు. షేక్ తహసిన్(575), బి.వసంత్‌కుమార్(574), కె.శరణ్య(570)కు పురస్కారాలు లభించాయని పేర్కొన్నారు. కె.శరణ్యకు రీవాల్యుయేషన్‌లో 5 మార్కులు పెరిగాయని తెలిపారు. ముగ్గురు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు


నిరుపయోగంగా వీఆర్‌ఓల భవనం


నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనం


చిల్లచెట్లతో నిండిన వీడియో కాన్ఫరెన్స్ భవనం

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న వైనం
- బీసీ హాస్టల్‌కు ఓ భవనం కేటాయించాలని వినతులు

తర్లుపాడు:

లక్షల రూపాయలు వెచ్చించి ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఆలనా పాలనా కరువవ్వడంతో భవనాలు దెబ్బతింటున్నాయి. అధికారులు సమన్వయం చేసుకుని ప్రత్యామ్నాయ అవసరాలకు ఆయా భవనాలను వినియోగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం తర్లుపాడులోని పాత తహసీల్దార్ కార్యాలయం గత 4 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించడంతో అప్పటి నుంచి పాత భవనం ఖాళీగా ఉంది. దీంతో చీకటి పడగానే కొందరు మందుబాబులు అక్కడి చేరుకుని మద్యం తాగుతున్నారు.

అలాగే స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం సైతం నిరుపయోగంగా ఉంది. ఈ రెండు భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని తర్లుపాడు వాసులు కోరుతున్నారు.

అద్దె భవనంలో బీసీ హాస్టల్..

మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో సుమారు 60 శాతంపైగా బీసీ విద్యార్థులు 6 నుంచి 10 తరగతి వరకు చదువుకుంటున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు 100 మందికిపైగా విద్యార్థులు అరకొర వసతులున్న అద్దె భవనంలో నిర్వహిస్తున్న బీసీ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారు. ఇరుకు గదుల్లో మగ్గుతూ అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. ఇంటర్మీడియెట్ కాలేజీతోపాటు బీసీ విద్యార్థులకు వసతులతో కూడిన నూతన బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు ఎప్పటి నుంచో అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. కనీసం ఈ భవనాలనైనా బీసీ హాస్టల్‌కు వినియోగించే విధంగా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బీసీ హాస్టల్‌కు కేటాయించాలి



పేరుకు మండల కేంద్రమే కానీ తర్లుపాడులో బీసీ విద్యార్థులకు సరైన హాస్టల్ వసతి లేదు. అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయాన్ని బీసీ హాస్టల్‌కు కేటాయిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– అక్బర్ అలీ, కోఆప్షన్ సభ్యులు, తర్లుపాడు

వసతులు ఉంటే విద్యార్థులకు మేలు



మండలంలోని సుమారు 10 గ్రామాల బీసీ విద్యార్థులు తర్లుపాడులోని బీసీ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. వసతులు లేని అద్దె భవనం కావడంతో ఇబ్బంది పడుతున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనంగానీ, ఖాళీగా ఉన్న ఐసీడీఎస్ భవనంలోగానీ హాస్టల్ నిర్వహిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– గుమ్మా రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీసీ జిల్లా ఉపాధ్యక్షుడు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మార్కాపురం ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఎం నరసింహులు


గిద్దలూరు కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జి భరత్‌చంద్ర


మార్కాపురం కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జిలు, న్యాయవాదులు


బేస్తవారిపేటలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

మార్కాపురం టౌన్: గ్లోబల్ వార్మింగ్‌తో కాలుష్యం పెరిగిందని, ఈ నేపథ్యంలో మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి బి దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జె కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మార్కాపురం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. మానవాళికి ప్రాణవాయువును అందించే మొక్కలను ప్రతి ఒక్కరూ నాటి, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఆలీ జహీర్, న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, వెలుగొండయ్య, చౌడేశ్వరరావు, జహీర్ సలాం, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కిట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పి.అనీల్‌కుమార్ కోరారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కిట్స్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు 28 మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం నరసింహులు తమ సిబ్బందితో కలిసి సుమారు 30 మొక్కలు నాటారు.

పట్టణంలోని మార్కెట్ యార్డులో అటవీశాఖ డీడీ సందీప్ కృపాకర్‌తో కలిసి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నారాయణరావు, అటవీశాఖ అధికారులు, మున్సిపల్, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ బ్రహ్మయ్య, అటవీశాఖ అధికారులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది మొక్కలు నాటారు. ఏపీఓ మహాలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధవీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ నర్సయ్య, ఏపీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు మొక్కలు నాటారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో గురువారం గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించేందుకు కృషి చేయాలని కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మొక్కలు నాటారు. పాతాళనాగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బీజేపీ నాయకులు, స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషశయనారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, ఏఓ జక్కం మెర్సీ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసనాయక్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు. అలాగే టీచర్స్ కాలనీలో బిలీవర్స్ ఈస్టన్ చర్చి ఫాదర్ గుర్రం జాన్ బి.రంగయ్య మొక్కలు పంపిణీ చేశారు.

కంభం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. గురువారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని ఆపేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, కళాశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, ఏపీఓ జీవరత్నం, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొమరోలులో మొక్క నాటుతున్న అధికారులు


కంభం గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, అధికారులు


కిట్స్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సిబ్బంది

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

గిద్దలూరు రూరల్: డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులో పట్టుబడిన ఐదుగురికి గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర 5 రోజుల జైలు శిక్షతోపాటుగా రూ.10 వేల జరిమానా విధించినట్లు స్థానిక సీఐ కె.సురేష్ తెలిపారు. ఇటీవల గిద్దలూరు సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని పేర్కొన్నారు. నిందితుల డ్రైవింగ్ లైసెన్సును జడ్జి ఆరు నెలలపాటు రద్దు చేశారని తెలిపారు.

గ్రామ సభకు 23 అర్జీలు


అధికారులకు అర్జీలు ఇస్తున్న రైతులు

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో గురువారం జేసీ ఆదేశాల మేరకు నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 23 అర్జీలు అందాయని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. అర్జీల్లో నాలుగు సమస్యలను పరిష్కరించామని, మిగిలిన వాటిపై తగిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్‌ఐ పీర్సా, వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిన ఉద్యోగులు


విజయవాడ వెళ్తున్న ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: విజయవాడలోని లయోలా కాలేజీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి గిద్దలూరు తాలూకా ఉద్యోగులు తరలివెళ్లారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల సంఘ గిద్దలూరు తాలుకా అధ్యక్షుడు వై.పి.రంగయ్య మాట్లాడుతూ.. ఉద్యోగస్తుల సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగ సంఘం నాయకులు అరిగెల వెంకటరామయ్య, నాగేంద్రయాదవ్, అల్లూరయ్య, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు


విద్యుత్ దీపాలంకరణలో రామాలయం

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లిలో పట్టాభి రామస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద పండితుడు శేఖరశర్మ పర్యవేక్షణలో టీటీడీ ఆగమ పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. శుక్రవారం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, అనంతరం సీతారాముల శాంతి కల్యాణం, భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మండలంలోని గొట్లగట్టులో హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

మార్కాపురం: వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులు నేర్చుకున్న విషయాలు ఉపయోగకరంగా ఉంటాయని సాధనా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె మధుసూదనశాస్త్రి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత గురించి వివరించారు. విశ్రాంత విద్యాశాఖ ఆర్జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి మాట్లాడుతూ.. చక్కటి చేతిరాతతో మంచి మార్కులు పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఆదివారం గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదువుకోవాలని సూచించారు. సీనియర్ పాత్రికేయుడు ఓఏ మల్లిక్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో సీహెచ్ కార్తీక్, ఎస్‌వీ మోక్షశ్రీ, ఎస్‌వీ సహస్ర, చేతిరాత పోటీల్లో సీహెచ్ కార్తీక, ఆర్ల ఆశ, ఎస్‌వీ సహస్ర, చిత్రలేఖనం పోటీల్లో ఎస్‌వీ సహస్ర, గాయత్రి, పవన్ గెలుపొందారు. కార్యక్రమంలో చేతిరాత శిక్షకుడు తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురం: గ్రంథాలయంలో బహుమతులతో విద్యార్థులు


బేస్తవారిపేట : బహుమతులు అందుకున్న విద్యార్థులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

బేస్తవారిపేట: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా పోటీలు నిర్వహించారు.

క్విజ్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, క్యారమ్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కంభం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రంగారావు, ప్రోగ్రాం అసోసియేట్ చెన్ను దివ్యశ్రీ ఆహారం తయారీ గురించి వివరించారు. +ఎఫ్ గుర్తు ఉన్న ఉప్పు, నూనె, నిత్యవసర వస్తువులను వినియోగించడం ద్వారా పోషకాహార లోపాలను నివారించవచ్చన్నారు. వంటల పోటీలు నిర్వహించి గని వెంకటయ్య స్మారక గ్రంథాలయం ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, ఎంఈఓ మాల్యాద్రి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలోని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 వెంకటరత్నం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు.

తర్లుపాడు: మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎంఈఓ సుజాత ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. పోషకాహార లోపంతో కలిగే నష్టాలను ప్రోగ్రాం కోఆర్డినేటర్ రంగారావు వివరించారు. ఎంఈఓ-2 సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం


మార్కాపురంలో యోగా పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొమరోలు: యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యవంతంగా జీవించవచ్చని మండల విద్యా శాఖాధికారి-2 బొర్రా వెంకటరత్నం పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో స్థానికులకు యోగా గురువు బొర్రా ఈశ్వరయ్య అవగాహన కల్పించి ఆసనాలు వేయించారు. యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రకటించారు. వీరికి డివిజన్ స్థాయిలో యోగాంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 తెలిపారు.

మార్కాపురం టౌన్: యోగా సాధనతో మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.భాగ్యవతి పేర్కొన్నారు. యోగాంధ్ర 2025లో భాగంగా మార్కాపురం మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువు శిరిగిరి చలపతి రావు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఏపీఎం, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కొమరోలులో యోగా పోటీల్లో పాల్గొన్న స్థానికులు

కుక్కల బెడద నివారణకు చర్యలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ నారాయణరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ప్రాంతాల ప్రజలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ 98499 07331ను సంప్రదించాలని సూచించారు. మార్కాపురంలో కుక్కలు పట్టేవారు అందుబాటులో ఉన్నారని తెలిపారు.